ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

శనివారం 22 నవంబరు 2025

నిరుపేదలకు నివాసాలు

● 584 గృహాలతో భవన సముదాయాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం ఉదయనిధి



భవన సముదాయాన్ని ప్రారంభించి, లబ్ధిదారులకు నివేశ పత్రాన్ని అందజేస్తున్న ఉదయనిధి

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్, ఎగ్మూరు నియోజకవర్గాల పరిధిలో ఇళ్లు లేని నిరుపేద కుటుంబీకుల కోసం రూ.90 కోట్లతో నిర్మించిన 584 గృహాలతో భవన సముదాయాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అందరికీ నివాస పథకం కింద మైలాపూరు శ్రీనివాసపురం వద్ద 396 నివాసాలతో 14 అంతస్థులతో నిర్మించిన భవనసముదాయాన్ని, ఎగ్మూరులో 188 నివాసాలతో 9 అంతస్థులతో నిర్మించిన భవన సముదాయాన్ని ప్రారంభించి లబ్దిదారులకు ఇళ్ళ కేటాయింపు పత్రాలను కూడా పంపిణీ చేశారు. ఎగ్మూరు వేంబులి అమ్మన్ ఆలయ ప్రాంగణం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు దామో అన్బరసన్, పీకే శేఖర్‌బాబు, చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీలు దయానిధి మారన్, తమిళచ్చి తంగపాండ్యన్, శాసనసభ్యులు తాయగం కవి, డి.వేలు, ఇ.పరంధామన్, ఎ.వెట్రి అళగన్, జోసెఫ్ సాముయేల్, రాష్ట్ర గృహ వసతి నగరాభివృద్ధి శాఖల ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉషా తదితరులు పాల్గొన్నారు.

24న ఆవడిలో డిప్యూటీ సీఎం పర్యటన

● ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి నాజర్

తిరువళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న తిరువళ్లూర్ జిల్లా ఆవడిలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సుమారు 33 మంది లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలను ఉదయనిధి అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాన్ని శుక్రవారం కలెక్టర్ ప్రతాప్‌తో కలసి మంత్రి నాజర్ పరిశీలించారు. లబ్ధిదారులు, నాయకుల సహా సుమారు 50 వేల మంది కూర్చొనే విధంగా వసతులు కల్పిస్తున్నారు. మంత్రి వెంట ఆవడి పోలీస్ కమిషనర్ శంకర్, అదనపు కమిషననర్ భవానీశ్వరి, కార్పొరేషన్ కమిషనర్ శరణ్య, మేయర్ ఉదయ్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్‌షోలు, సభల్లో ప్రజల భద్రత...

రాజకీయ పార్టీలదే బాధ్యత

● హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం



చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ పార్టీలు నిర్వహించే బహిరంగ సభలు, పర్యటనలు, రోడ్‌షోల్లో పాల్గొనే ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆయా పార్టీలదేనని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు కొత్తగా రూపొందించిన విధివిధానాలను శుక్రవారం హైకోర్టుకు నివేదించింది. కరూర్‌లో టీవీకే నేత విజయ్ నిర్వహించి రోడ్‌షో సందర్భంగా 41 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై స్పందించిన హైకోర్టు.. రాజకీయ పార్టీల సభలు, ప్రచార పర్యటనలు, రోడ్‌షోలకు సంబంధించిన ముసాయిదా విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వీటిని నివేదిక రూపంలో శుక్రవారం ఉదయం హైకోర్టుకు సమర్పించింది. ఆ నివేదిక ప్రకారం.. ఇకపై రాష్ట్రంలో జరిగే సభలు, మహానాడులు, రోడ్‌షోలకు హాజరయ్యే జనాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆయా రాజకీయ పార్టీలకే ఉంటుంది. ఈ నివేదికలోని విధివిధానాలు మతపరమైన కార్యక్రమాలకు వర్తించవు. హైకోర్టులో ప్రభుత్వం సమర్పించిన విధివిధానాల్లో కీలకమైన అంశాలు ఈ విధంగా ఉన్నాయి..

- 5 వేల మందికిపైగా ప్రజలు పాల్గొనే సభలు, రోడ్‌షోలకు మాత్రమే ప్రభుత్వ ముసాయిదా విధివిధానాలు వర్తిస్తాయి, మతపరమైన కార్యక్రమాలకు వర్తించవు.
- సభలు, రోడ్‌షోలో ప్రారంభ సమయానికి రెండు గంటల ముందు నిర్దేశిత ప్రాంతాల్లో జనం చేరకుండా జాగ్రత్తలు పాటించాలి.
- సభలు, రోడ్‌షోల సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లితే ఆ నష్టాన్ని నిర్వాహకులే భరించాల్సి ఉంటుంది.
- సభలు, రోడ్‌షోలకు హాజరయ్యే ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులదే.
- పోలీసులు అనుమతించిన సమయాన్ని తప్పకుండా పాటించాల్సి ఉంటుంది.
- కార్యక్రమ అనుమతి కోసం సమర్పించిన దరఖాస్తులో సభలకు, రోడ్‌షోలకు హాజరయ్యే జనానికి కల్పించనున్న ప్రాథమిక చికిత్స, అంబులెన్స్ తదితర వైద్యసదుపాయాలను గురించి రాతపూర్వకంగా తెలియజేయాలి.
- హఠాత్తుగా నిర్వహించే ధర్నాలు, రాస్తారోకోలు తదితర ఆందోళనలకు జిల్లా కలెక్టర్ల నుండి, ఆయా నగరాల పోలీసు కమిషనర్ల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.

ఎవరి కొంప

మునుగుతుందో?

● రాష్ట్ర రాజకీయాల్లో మూడు 'టీవీకే' పార్టీలు

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మల్లై సత్య ప్రారంభించిన కొత్త పార్టీతో విజయ్ పార్టీ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో చాలా కాలంగా ఒక అక్షరం పంచాయతీ ముఖ్యమైన అంశంగా మారింది. కొత్త పార్టీలు ప్రారంభించేవారు, ఇప్పటికే ఉన్న ప్రజాదరణ పొందిన పార్టీ పేరులోని ఒక అక్షరాన్ని తమ కొత్త పార్టీ పేరులో ప్రారంభం, ముగింపు, మధ్యలో జోడించడం జరుగుతోంది. ఈ క్రమంలో, ఎండీఎంకే నుంచి వైదొలిగిన మల్లై సత్య 'ద్రావిడ వెట్రి కళగం' అనే పేరుతో పార్టీ ప్రారంభించారు. ఈ పేరు క్లుప్తంగా ఆంగ్లం అక్షరాలతో 'డీవీకే' అని పలుకుతారు. తమిళంలో ద, త రెండూ ఒకటే అయినందున దీనిని కూడా టీవీకే అనే పిలుస్తున్నారు. ప్రస్తుతం నటుడు విజయ్ ప్రారంభించిన 'తమిళగ వెట్రి కళగం' పార్టీని కూడా, ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు 'టీవీకే' అని పిలుస్తున్నారు. ప్రస్తుతం మల్లై సత్య ప్రారంభించిన పార్టీ పేరు కూడా క్లుప్తంగా 'టీవీకే' కావడంతో విజయ్ పార్టీ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అదే సమయంలో, ఇంతకు ముందే వేల్ మురుగన్ 'తమిళ వాల్వురిమై కట్చి' పార్టీని ప్రారంభించగా, అది కూడా ఆంగ్లం అక్షరాల్లో 'టీవీకే'గా ఉంది. ఆ ప్రకారం, రాష్ట్ర రాజకీయాల్లో 3 టీవీకేలు ఎన్నికల్లో పోటీచేయనున్నాయి. ఈ వ్యవహారం ఎవరి కొంపముంచుతుందో వేచి చూడాలి మరి.

వరదరాజ పెరుమాళ్ ఆలయంలో

రత్నాంగిసేవ

● పోటెత్తిన భక్తులు



ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలో ప్రసిద్ధి చెందిన వరదరాజ పెరుమాళ్ ఆలయంలో వైభవంగా నిర్వహించిన రత్నాంగి సేవలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. విజయనగర సామ్రాజ్యాధిపతికి రాజగురువుగా వ్యవహరించి కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రారంభకాల ధర్మకర్తగా వ్యవహరించిన లక్ష్మీకుమార తాత దేశికన్ సేవలను కొనియాడేలా ఆయన జన్మనక్షత్రం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజ పెరుమాళ్‌ను నవరత్నాలు పొదిగిన అంగీ, గులాబీ మాలలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణ, భక్తుల గోవిందనామస్మరణ, మేళతాళాల మధ్య స్వామివార్లను పల్లకీలో ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. ఈ వైభవంలో పాల్గొన్న భక్తులను ఆలయ నిర్వాహకులు దర్శనానికి అనుమతించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

నగరంలో మళ్లీ డబుల్ డెక్కర్ బస్సులు



చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జనవరి నుంచి నగరంలో ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు మళ్ళీ పరుగులు తీయనున్నాయి. రెండు దశాబ్దాల తర్వాత కొత్త సదుపాయాలతో తయారైన ఈ బస్సులను మహానగర రవాణా సంస్థ కొనుగోలు చేసింది. ఇటీవల నగరం నలుమూలలా ప్రయోగాత్మకంగా నడిపారు. నగరంలో తాంబరం నుండి బ్రాడ్వే వరకు నడిచిన 18ఎ నెంబరు డబుల్ డెక్కర్ బస్సులు నడిచేవి. 2008లో ఫ్లైఓవర్ల నిర్మాణాలు జరుగుతుండటంతో ఆ బస్సులను నిలిపివేశారు. ఆ తర్వాత మళ్లీ నగరంలో డబుల్ డెక్కర్ బస్సులను నడిపేందుకు మహానగర రవాణా సంస్థ (ఎంటీసీ) సన్నాహాలు ప్రారంభించింది. ప్రస్తుతం ప్రైవేటు భాగస్వామ్యంతో కొత్త బస్సులను కొనుగోలు చేసి నడపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కరూర్‌లో ఆలయ భూముల వ్యవహారం...

ఎంపీ, మాజీ మంత్రి సహా 400 మంది అరెస్ట్



కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి



మాజీమంత్రి ఎంఆర్ విజయభాస్కర్

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరూర్ వెన్నమలై బాలసుబ్రమణ్యస్వామి ఆలయానికి చెందిన భూములను విడిపించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకున్న కారణంగా శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి, అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎంఆర్. విజయభాస్కర్ సహా 400 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే బాలసుబ్రమణ్యస్వామి ఆలయానికి చెందిన భూములను ఆక్రమించుకుని కొంత మంది నిర్మించుకున్న ఇళ్లను తొలగించేందుకు ఉత్తర్వులివ్వాలని కోరుతూ ఆలయం తరుపున మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో ఓ పిటిషన్ దాఖలైంది. విచారణ జరిపిన న్యాయస్థానం ఆలయ భూముల్లో ఇళ్లు కట్టుకున్న వారందరూ వెంటనే ఖాళీ చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీచేసింది. నెల రోజులు గడిచినా ఇళ్లు ఖాళీ చేయకపోవడంతో గత నెల అధికారులు ఆలయ భూముల్లో ఉన్న దుకాణాలకు సీలు వేశారు. ఆ తర్వాత ఈ నెల 14న కన్నమ్మాళ్ అనే మహిళ ఇంటికి సీలు వేసేందుకు వెళ్లిన అధికారులను అక్కడున్నవారు అడ్డుకున్నారు. దేవాదాయశాఖ చర్యలను ఖండిస్తూ నిరాహార దీక్షకు దిగడంతో అధికారులు అక్కడినుండి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో, గురువారం ఉదయం కరూర్ చిన్నవడుగపట్టిలో ఉన్న కన్నమ్మాళ్ ఇంటికి సీలు వేసేందుకు దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రమణికాంత్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది, జిల్లా ఏఎస్పీ జయచంద్రన్ నేతృత్వంలోని పోలీసులు అక్కడికి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి, మాజీమంత్రి ఎంఆర్ విజయభాస్కర్, డీఎంకే, పీఎంకే తదితర పార్టీల నేతలు అధికారులను అడ్డుకుని వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు గంటన్నరకు పైగా ఆందోళన కొనసాగడంతో పోలీసులు 400 మందిని అరెస్టు చేసి ఓ కల్యాణమండపానికి తరలించారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి సాయంత్రం విడుదల చేశారు.

మేట్టూరు డ్యామ్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో



డ్యామ్ నుండి విడుదలవుతున్న జలాలు

టి.నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యామ్ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, కర్ణాటకలో రిజర్వాయర్ల నుండి విడుదలవుతున్న అదనపు జలాల కారణంగా ఆ డ్యామ్‌లోకి ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఆ డ్యామ్‌లోకి ప్రవేశిస్తున్న జలపరిమాణం 5841 ఘనపుటడుగుల నుంచి 6367 ఘనపుటడుగులకు పెరిగింది. డ్యామ్ నీటిమట్టం కూడా 112.33 అడుగుల నుండి 112.61 అడుగులకు పెరిగిందని నీటివనరుల విభాగం అధికారులు ప్రకటించారు. డ్యామ్ నుంచి కావేరి డెల్టా ప్రాంతాల్లో పంటల సాగుకోసం సెకనుకు వెయ్యి ఘనపుటడుగులు, డ్యామ్ అనుబంధ కాల్వల కింద సాగవుతున్న పంటల కోసం సెకనుకు 400 ఘనపుటడుగులు చొప్పున జలాలను విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కంచి ప్రజలు, పార్టీ నేతలతో

రేపు విజయ్ భేటీ



చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ యాభై రోజుల విరామం అనంతరం ఆదివారం ప్రజల ముందుకు రాబోతున్నారు. సెప్టెంబర్ 27 రాత్రి కరూరు రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందటంతో ఆయన బహిరంగ సభలు, పర్యటనలకు తాత్కాలికంగా స్వస్తి పలికి ఇళ్లకే పరిమితమైపోయారు. పార్టీ సమావేశాలను పయ్యనూరు వద్దనున్న పార్టీ కార్యాలయంలోనే జరిపారు. ఈ పరిస్థితులలో డిసెంబర్ 4న సేలం నగరంలో పార్టీ సభకు అనుమతివ్వాలని టీవీకే నేతలు అక్కడి పోలీసులను కోరారు. ఓ వైపు తిరువణ్ణామలై ఆలయంలో డిసెంబరు 3న జరుగనున్న కార్తీక మహాదీపోత్సవాలకు, డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత దినం సందర్భంగాను భారీ యెత్తున భద్రతా ఏర్పాట్లను చేపట్టనుండటంతో డిసెంబర్ 4న సేలంలో బహిరంగ సభకు అనుమతినివ్వలేమని పోలీసులు పేర్కొన్నారు. అదే సమయంలో నగరానికి చేరువగా పోలీసుల అనుమతితో నిమిత్తం లేకుండా ప్రైవేటు స్థలంలో బహిరంగ సభ జరపాలని టీవీకే నేత విజయ్ నిర్ణయించారు. ఆ ప్రకారమే ఆదివారం పాత మహాబలిపురం రోడ్డు (ఓఎమ్మార్)లోని జేప్పియార్ వర్శిటీ మైదానంలో కాంచీపురం జిల్లా పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, ప్రజలతో భేటీ అయ్యేలా ఓ బహిరంగ సభ జరిపేందుకు సిద్ధమవుతున్నారు. ఆ సభలో సుమారు 1500 మంది హాజరవుతారని పార్టీ నిర్వాహకులు చెబుతున్నారు.

కొండమీది నుంచి జారిపడి

అడవి ఏనుగు మృతి



ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న వెటర్నరీ డాక్టర్లు

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కల్లకాడు మాంజోలై అటవీ ప్రాంతంలో రాధాకృష్ణన్ అనే ఏనుగు కొండచరియలో 20 అడుగుల ఎత్తు నుండి జారిపడి మృతి చెందింది. నీలగిరి జిల్లా గూడలూరు సమీపంలోని ఓవేలి పట్టణ పంచాయతీ పరిధిలో గత నాలుగేళ్లుగా రాధాకృష్ణన్ అనే 30 యేళ్ల అడవి ఏనుగు తేయాకు, కాఫీ, ఏలకుల తోటలు, జననివాస ప్రాంతాల్లో చొరబడి పంటలను, ఇళ్లను ధ్వంసం చేస్తోంది. ఆ ఏనుగు దాడిలో ఇప్పటిదాకా 12 మంది మరణించారు. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల ప్రధాన సంరక్షణాధికారి డోగ్రా అదేశాల మేరకు ఏనుగును సెప్టెంబరు 23న బంధించి ముదుమలై టైగర్ రిజర్వు క్యాంప్‌కు తరలించారు. ఆ తర్వాత అక్టోబరు 26న తిరునల్వేలి జిల్లా కల్లకాడు మాంజోలై సమీపంలోని దట్టమైన అడవిలో విడిచి పెట్టారు. ఆ సందర్భంగా ఆ ఏనుగుకు జీపీఎస్ పరికరంతో కూడిన కాలర్ ఐడీ అమర్చారు. గత 25 రోజులుగా ఆ ఏనుగు ఆ అటవీ ప్రాంతాల్లోనే సంచరించింది. ఈ నెల 18న ఆ ఏనుగు మేల్‌కోదయారు ప్రాంతంలో సంచరిస్తూ 20 అడుగుల ఎత్తు కొండ దారిలో వెళ్తూ తారు రోడ్డుపై పడి ప్రాణాలు కోల్పోయింది. ఈ విషయాన్ని ఆ ఏనుగుకు పెట్టిన జీపీఎస్ పరికరం కాలర్ ఐడీ సిగ్నల్ ద్వారా అటవీ శాఖ అధికారులు తెలుసుకున్నారు. ఆ తర్వాత వెటర్నరీ డాక్టర్లను రప్పించి గురువారం సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించారు. గురువారం అటవీశాఖ వాహనంలో ఆ ఏనుగు కళేబరాన్ని అభయారణ్య ప్రాంతంలో ఖననం చేశారు.

అన్నాడీఎంకే నేత, మాజీ ఎమ్మెల్యే హత్యకేసు

ముగ్గురిని దోషులుగా ప్రకటించిన హైకోర్టు

● 24న శిక్ష ఖరారు



మాజీ ఎమ్మెల్యే సుదర్శనం (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే సుదర్శనం హత్యకేసులో ముగ్గురిని దోషులుగా ప్రకటించిన మద్రాస్ హైకోర్టు.. వచ్చే సోమవారం శిక్ష ఖరారు చేయనున్నట్లు ప్రకటించింది. 2005 జనవరిలో తానాకుళంలో నివశించే మాజీ ఎమ్మెల్యే సుదర్శనం ఇంట్లో చొరబడిన దోపిడీ ముఠా ఆయన్ని తుపాకీతో కాల్చి చంపి, ఆయన భార్య, కుమారులపై దాడికి పాల్పడి 62 సవర్ల నగలు దోచుకుని పరారయ్యారు. ఈ హత్యతో సంబంధమున్న ముఠాపై చర్యలకు నాటి సీఎం ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు సుదర్శనం హత్యకు సంబంధించి భవార్యా హంతక ముఠాకు చెందిన తొమ్మిది మందిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. వీరిలో ముగ్గురు మహిళలు బెయిల్‌పై విడుదలై అజ్ఞాతంలోకి జారుకోగా, మరో ఇద్దరు జైలులోనే మృతిచెందారు. మిగిలినవారిలో జగదీష్, రాకేష్, అశోక్ అనేవారిని మద్రాస్ హైకోర్టులో జరిగిన తుది విచారణకు భారీ బందోబస్తు మధ్య పోలీసులు శుక్రవారం హాజరుపరిచారు. ఆ ముగ్గురిని దోషులుగా ప్రకటించిన న్యాయస్థానం వచ్చే సోమవారం శిక్ష ఖరారు చేయనున్నట్లు తెలిపింది.

మెట్రో ప్రాజెక్ట్‌కు కేంద్రం అనుమతి నిరాకరణ...

మదురైలో డీఎంకే మిత్రపక్షాల భారీ ధర్నా



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న డీఎంకే, మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదురైలో మెట్రోరైలు ప్రాజెక్టు అమలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని ఖండిస్తూ డీఎంకే మిత్రపక్షాల ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. మదురై తిరుమంగళం ప్రాంతం నుంచి ఒత్తకడై వరకు మెట్రోరైలు ప్రాజెక్టును అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తిరుమంగళం నుంచి వసంత్‌నగర్ వరకు ఫ్లైఓవర్ల రైలు మార్గాన్ని, వసంత్‌నగర్ నుండి తల్లాకులం వరకు భూగర్భంలో సొరంగ రైలు మార్గాన్ని, అక్కడి నుండి ఒత్తకడై దాకా భూమిపై ఫ్లైఓవర్లపై మార్గాన్ని నిర్మించాలని ప్రణాళికలు రూపొందించి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపింది. ఈ నేపథ్యంలో మదురై, కోయంబత్తూరు మెట్రోరైలు ప్రాజెక్టులకు కేంద్ర గృహనిర్మాణ, నగర శివారు ప్రాంతాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ అనుమతిని నిరాకరిం చింది. . ఈ నేపథ్యంలో మదురై మెట్రోరైలు ప్రాజెక్టుకు కేంద్రం అనుమతించనందుకు నిరసనగా డీఎంకే, దాని మిత్రపక్షాలైన కాంగ్రెస్, ఎండీఎంకే, డీపీఐ , సీపీఐ, సీపీఎం తదితర పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో పళంగానత్తం కూడలి వద్ద భారీ నిరసన ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో మదురై సబర్బన్ ఎమ్మెల్యే దళపతి ఇతర నాయకులు కూడా పాల్గొన్నారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా నుంగంబాక్కంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి.. నుంగంబాక్కం పరిధిలోని కాలేజ్ రోడ్డు, నుంగంబాక్కం హైవే, మూర్స్ రోడ్డు, కేఎన్‌కే రోడ్డు, వాలస్ గార్డెన్ 1 నుంచి 3 వీధులు, రట్‌లాండ్ గేట్ 1 నుంచి 6 వీధులు, సుబ్బారావు అవెన్యూ 1 నుంచి 3 వీధులు, ఆండర్సన్ రోడ్డు, హాడోస్ రోడ్డు 1,2 వీధులు, నవాబ్ హబీబుల్లా రోడ్డు 1,2 అవెన్యూలు, బైక్రాఫ్ట్ గార్డన్ వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది.

గ్రూప్-1 మెయిన్స్ హాల్ టిక్కెట్ల విడుదల

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష హాల్ టిక్కెట్లు విడుదల చేసినట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది. ఈ మేరకు టీఎన్‌పీఎస్సీ విడుదల చేసిన ప్రకటనలో.. 72 పోస్టుల భర్తీకి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జూన్ 15వ తేది నిర్వహించగా, 1,86,128 మంది హాజరయ్యారని తెలిపింది. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు డిసెంబరు 1 నుంచి 4, 8 నుంచి 10వ తేది వరకు నగరంలో మెయిన్స్ నిర్వహించనున్నామన్నారు. ఈ పరీక్ష హాల్ టిక్కెట్లు www.tnpsc.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశామని తెలిపింది. అభ్యర్థులు 'ఓటీఆర్ డాష్ బోర్డు' ద్వారా దరఖాస్తు నెంబరు, పుట్టిన తేది నమోదుచేసి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

వీడియో ఎడిటింగ్, ఫొటోగ్రఫీపై యువతకు శిక్షణ

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫొటోలు, వీడియో ఎడిటింగ్ తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర ప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివాహ ఫొటోలు, వీడియో ఎడిటింగ్ తదితరాలపై డిసెంబరు 1 నుంచి 5వ తేది వరకు శిక్షణ ఇవ్వనుంది. టెన్త్ ఉత్తీర్ణులై 18 ఏళ్లు నిండిన వారు శిక్షణకు హాజరుకావచ్చు. శిక్షణా సమయంలో తక్కువ అద్దెతో బసవసతి కల్పించనున్నారు. వివరాలకు ఈకాట్టుతాంగల్‌లోని సంస్థ కార్యాలయాన్ని 8668102600, 9943685468 అనే నెంబరు సంప్రదించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

24న 'సర్'కు వ్యతిరేకంగా డీపీఐ ఆందోళన

అడయార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓట్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా తమ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఆందోళన జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. ఎస్.ఐ.ఆర్ చేపట్టరాదన్న ఏకైక డిమాండ్‌తో తమ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 24న చెన్నై నగరంలో ఉదయం 10 గంటలకు ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎస్ఐఆర్ అనేది భారతీయ జనతా పార్టీ, ఎన్నికల సంఘం సంయుక్తంగా చేపట్టిన కుట్ర అని ఆరోపించారు. దానిని తక్షణం నిలిపివేయాలని కోరుతూ ఆందోళన చేయనున్నట్లు వెల్లడించారు.

ఎన్నికల సామగ్రి కొనుగోలుకు టెండర్లు విడుదల

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల సామగ్రి కొనుగోలుకు టెండర్లు విడుదల చేశారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు కొన్ని నెలలు మాత్రమే ఉండడంతో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేపట్టింది. ఆ ప్రకారం, ఎన్నికల సామగ్రి కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించింది. 26.37 లక్షల డ్రాయింగ్ పిన్, 1,05,480 రబ్బర్ స్టాంప్ ప్యాడ్‌లు, 1,05,480 రబ్బర్ స్టాంప్ పౌచ్‌లు, ఓటింగ్ యంత్రాలను కవర్ చేసే 70వేల ప్లాస్టిక్ కార్డ్ బోర్డ్ పెట్టెలు, 1,05,480 పెన్సిళ్లు, 3,16,440 బ్లూ బాల్ పాయింట్ పెన్నులు, 1,05,480 రెడ్ బాల్ పాయింట్ పెన్నులు, 1,05,205 సిల్వర్, వైట్ బాల్ పాయింట్ పెన్నుల కొనుగోలుకు టెండర్లు విడుదలయ్యాయి.

టెన్త్ విద్యార్థుల వివరాల సవరణకు చివరి అవకాశం

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల జాబితా సిద్ధమైన నేపథ్యంలో, వారి వివరాల్లో సవరణలకు ప్రధానోపాధ్యాయులకు చివరి అవకాశం కల్పించారు. ఈ మేరకు పరీక్షల శాఖ డైరెక్టరేట్, అన్ని జిల్లాల ప్రధాన విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో వివారలు ఇలా ఉన్నాయి... ప్రస్తుత విద్యా సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల పేర్లతో కూడిన జాబితా సిద్ధం చేశామన్నారు. ఈ జాబితాను 'ఎమిస్' వెబ్‌సైట్ పరిశీలించి, విద్యార్థుల పేరు, పుట్టిన తేది, లింగ నిర్ధారణ, ఫొటో, సెల్‌ఫోన్ నెంబరు, చిరునామా తదితరాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించాలన్నారు. విద్యార్థుల వివరాల్లో లోపాలుంటే వాటిని సరిచేసేందుకు ఈ నెల 19వ తేది వరకు అవకాశం కల్పించామన్నారు. ఈ క్రమంలో, విద్యార్థులు, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 27వ తేది వరకు విద్యార్థుల వివరాల్లో లోపాలు ఉంటే సవరించాలని, ఈ విషయమై ప్రధానోపాధ్యాయులు, తరగతి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పరీక్ష శాఖ డైరెక్టరేట్ తెలియజేసింది.

రాష్ట్రంలో 7 శాతం తక్కువ వర్షపాతం

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలతో ఇప్పటివరకు సాధారణం కన్నా 7 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ మేరకు వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలతో సరాసరి వర్షపాతం 305.8 మి.మీ కాగా, ఈ ఏడాది గురువారం వరకు 284.7 మి.మీ తక్కువ వర్షపాతం నమోదైంది. అలాగే, రాజధాని నగరం చెన్నైలో 24 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. నగరంలో ఈశాన్య రుతుపవనాలతో సరాసరి వర్షపాతం 555.3 మి.మీ కాగా, ఈ ఏడాది 422.7 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

యువ శాస్త్రవేత్తలుగా 14 మంది విద్యార్థుల ఎంపిక



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సైన్స్ సమాఖ్య, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమేటికల్ సైన్స్, జిల్లా పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కాట్పాడి ప్రభుత్వ బాలుర హయ్యర్ సెకంటరీ స్కూలులో గురువారం సైన్స్ సదస్సు నిర్వహించారు. సుస్థిర నీటి నిర్వహణపై జరిగిన ఈ సదస్సులో ఉత్తమ పరిశోధన పత్రాలు సమర్పించిన 14 మంది విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా ఎంపిక చేశారు. మాస్టర్ విభాగంలో ఉసూర్ ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలకు చెందిన కె.దీప, డి.సంగరి, కాట్పాడి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.దినేష్, పి.ధీరజ్, సాయినాధపురం ఎన్‌కేఎం పేర్నాంబట్టులోని ఇస్లాం బాలికోన్నత పాఠశాలకు చెందిన ఆలియా నుసుబాబర్దాన్, సి.నాసికా అదీన్, ప్రభుత్వ ఎయిడెడ్ హయ్యర్ సెకండరీ స్కూలుకు చెందిన ఎస్పీ ఆకాష్, ఆర్.అధవన్, తొట్టపాళయం కార్పొరేషన్ మిడిల్ స్కూల్‌కు చెందిన ఎం.తిషికా, ఎం.ఇసాండిక, సత్తువాచేరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన దినేష్, సిద్ధే, జూనియర్ విభాగంలో పేర్నాంబట్టు ఇస్లాం బాలికోన్నత పాఠశాలకు చెందిన డీఏ సనాశర్మాయిన్, కేఎం మలిహా తదితరులు యువ శాస్త్రవేత్తలుగా ఎంపికయ్యారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు పి.అముద అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ జనార్ధనన్ స్వాగతం పలికారు.

రాష్ట్రంలో సంకీర్ణ సర్కారుకు నో ఛాన్స్

● ఎంపీ తంబిదురై



టి.నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే అవకాశమే లేదని అన్నాడీఎంకే ఎంపీ అన్నారు. కృష్ణగిరి జిల్లా బర్గూరు సమీపం చింతకంపల్లిలో అంగన్వాడీ కేంద్రం భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వివిధ పార్టీలతో కూటమి, మెగా కూటమి అంటూ పొత్తులు మాత్రమే కుదుర్చుకోవటం ఆనవాయితీ అని చెప్పారు. గతంలో రాజాజీ, కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత పలు పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారం చేపట్టారని చెప్పారు. అయితే ఆ నాయకులెవరూ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, మిత్రపక్షాలకు మంత్రివర్గంలో స్థానం కూడా కల్పించలేదని తంబిదురై గుర్తు చేశారు. వచ్చే యేడాది జరిగే శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే అధికారంలోకి వస్తుందని, అదే సమయంలో మిత్రపక్షాలతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ఆస్కారమే లేదని, సొంత మెజారిటీతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. తమ కూటమి అధికారంలో వస్తే అధికారంలో భాగస్వామం కోరుతామంటూ కూటమిలోని మిత్రపక్షాల నాయకులు చెబుతుండటం ఆయా పార్టీల కార్యకర్తల కోరిక మాత్రమేనని, అంతమాత్రానికే కూటమికి నాయకత్వం వహించే పార్టీ ఆ పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపే ప్రసక్తే లేదని తంబిదురై స్పష్టం చేశారు.

మద్దతు ధర కోసం చెరకు రైతుల ధర్నా



తిరుత్తణి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెరకుకు కనీస మద్దతు ధర పెంచాలని కోరుతూ తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని కమలా సినిమా థియేటర్ వద్ద చెరకు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘాల నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం చెరకు మద్దతు ధరను టన్ను రూ.5,500లకు పెంచాలని, అదేవిధంగా పాతబడిన చక్కెర మిల్లును ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు.

ఎక్స్‌ప్రెస్ మాల్‌లో అగ్నిప్రమాదం



మంటలార్పేందుకు వచ్చిన అగ్నిమాపక శకటాలు

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలో నిత్యం రద్దీగా ఉండే ఎక్స్‌ప్రెస్ మాల్‌లో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. రాయపేటలోని వైట్స్‌రోడ్డులో ఉన్న ఎక్స్‌ప్రెస్ మాల్‌లో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా హఠాత్తుగా మంటలు వ్యాపించాయి. ఇవి మూడో ఫ్లోర్ వరకు వ్యాపించడంతో షాపింగ్ మాల్ ప్రాంగణంలో పొగ దట్టంగా అలుముకుంది. దీంతో భయాందోళనకు గురైన వ్యాపారులు, కొనుగోలుదారులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందడంతో మూడుకు పైగా ఫైర్ ఇంజన్లలో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది గంటసేపు శ్రమించి మంటలను అదుపుచేశారు. పోలీసులు ఈ ప్రమాదం గురించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దీపావళి చిట్టీ పేరుతో మోసం

అడయార్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసార్‌పాడి గాంధీపురంలో దీపావళి చిట్‌ఫండ్ పేరుతో దాదాపు 800 మందిని ఓ మహిళ మోసం చేసింది. దీనిపై చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. పోలీసుల కథనం మేరకు గాంధీపురానికి చెందిన దేవి అనే మహిళ దీపావళి చిట్టీ పేరుతో 800 మంది స్థానికుల వద్ద డబ్బులు వసూలు చేసింది. నెలకు రూ.1300 చొప్పున చెల్లిస్తే 12 నెలల తర్వాత నగదుతో పాటు వెండి నాణెం, టపాసులు, స్వీట్ బాక్స్ కిరాణా సరకులు ఇస్తామని నమ్మించారు. గత దీపావళికి ముందు కొంతమందికి మాత్రమే ఇచ్చి మిగిలినవారికి ఇవ్వలేదు. దీంతో మిగిలినవారు క్రైమ్‌బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే, దేవి అల్లుడు లోకేష్, ఆయన స్నేహితుడు మురళి గురువారం రాత్రి ఆ ప్రాంతానికి వచ్చి రూ.5 వేలు చొప్పున ఇస్తామని, మిగిలిన సొమ్ము నెల రోజుల్లో చెల్లిస్తామని బాధితులకు చెప్పారు. అయితే ఆగ్రహంతో ఉన్న బాధితులు వారిద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

తిరుమంగళంలో డ్రగ్స్ విక్రయం

● లా విద్యార్థి సహా నలుగురి అరెస్టు

అడయార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమంగళం పరిసర ప్రాంతాల్లో మత్తుపదార్థాలను విక్రయించిన కేసులో లా విద్యార్థి సహా నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని తేనాంపేటకు చెందిన షాబుద్దీన్, వలసరవాక్కంకు చెందిన శరత్, లా చదువుతున్న శ్రీనివాసన్‌లుగా గుర్తించారు. వీరి నుంచి కారుతో పాటు రూ.27.5 లక్షల నగదు, శ్రీనివాసన్ నివాసంలో 10 గ్రాముల గంజా స్వాధీనం చేసుకున్నారు. షాబుద్దీన్ నగరంలోని ఓ ఐటీ కంపెనీలో టెక్కీగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. అదేసమయంలో ఈ కేసుతో సంబంధం ఉన్న ఓ కంపెనీ యజమాని హరీష్, ఆయన స్నేహితుడు సాయిని కూడా పోలీసులు విచారణకు పిలిపించారు. ఈ విషయం తెలుసుకున్న పలుప్రాంతాలకు చెందిన అన్నాడీఎంకే నేతలు స్టేషన్‌కు వెళ్ళి హరీష్ ఎక్కడ అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు హరీష్‌ను విచారణకు పిలవలేదని తెలుసుకుని అక్కడ నుంచి వెళ్ళిపోయారు.

టమోటా కిలో రూ.30

● రైతుల ఆనందం



పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టమోటా కిలో రూ.30 పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దిండుగల్ జిల్లా విరుపాచ్చి, కావేరియంపట్టి తదితర ప్రాంతాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో టమోటా సాగు చేస్తుంటారు. రైతులు తాము పండించిన టమోటాను ఒట్టాన్‌సత్రం మార్కెట్‌కు తరలిస్తుంటారు. కొద్దిరోజుల క్రితం వరకు టమోటా కిలో రూ.15 నుంచి రూ.20 ధర పలుకుతోంది. ఈ క్రమంలో, శుక్రవారం కిలో టమోటా రూ.50 ధర పలికింది. 14 కిలోల పెట్టె రూ.200-రూ.250 ధర పలికిన నేపథ్యం లో, ప్రస్తుతం రూ.500-రూ.600 ధర పలుకుతోంది. ధర పెరుగుదలతో టమోటా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యల వ్యవహారం

ఆదవ్ అర్జునపై కేసు కొట్టేసిన హైకోర్టు

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన ఆదవ్ అర్జునపై నమోదైన కేసును మద్రాసు హైకోర్టు కొట్టేసింది. కరూర్ దుర్ఘటనలో 41 మంది మృతిచెందిన వ్యవహారంలో పలువురు టీవీకే నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో టీవీకే ఎన్నికల ప్రచార నిర్వహణ కార్యదర్శి ఆదవ్ అర్జున కరూర్ దుర్ఘటనకు సంబంధించిన తన ఎక్స్ పేజీలో చేసిన పోస్ట్‌లో... రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించేలా వ్యాఖ్యలున్నాయి. అనంతరం కొద్ది నిమిషాల్లోనే ఆ పోస్ట్‌ను ఆదవ్ అర్జున డెలీట్ చేశారు. కానీ, ఈ పోస్ట్ ఆధారంగా ఆయనపై చెన్నై సైబర్ క్రైం పోలీసులు, అల్లర్లు ప్రేరేపించడం, ప్రజా శాంతికి భంగం కలిగించడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. తనపై నమోదైన కేసు రద్దు చేయాలని కోరుతూ ఆదవ్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఎక్స్‌లో పోస్ట్ చేసిన 34 నిమిషాల్లోనే దానిని డెలీట్ చేశానని, ఈ పోస్ట్ పెట్టడంలో ఎలాంటి దురుద్దేశం లేదని విన్నవించారు. అయితే రాష్ట్ర పోలీసులు మాత్రం ప్రజా శాంతికి భంగం కలిగించేలా ఆదవ్ వ్యాఖ్యలు చేశారని, ఆ తరువాత ఆయన తప్పించుకుపోయారని పేర్కొంది. ఇరుతరఫు వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. శుక్రవారం కేసు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

600 కిలోల గుట్కా స్వాధీనం : పీఎంకే నేత అరెస్టు

అడయార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి నామక్కల్‌కు మినీ లారీలో తరలిస్తున్న 600 కేజీల నిషేధిత గుట్కాను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పీఎంకే నేతతో సహా మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి సేలం జిల్లాలోని మెయ్యనూరులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన మినీ లారీని ఆపి తనిఖీ చేయగా, అందులో నిషేధిత గుట్కా గుర్తించారు. పోలీసులను చూడగానే మినీ లారీ డ్రైవర్ పారిపోయాడు. దీంతో వ్యానులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరంతా సేలం జిల్లా మేట్టూరుకు చెందిన గౌతమ్, మణికంఠన్, అశోక్‌గా గుర్తించారు. వీరిలో గౌతమ్ స్థానికంగా పీఎంకే నేతగా తేలింది. వ్యానులో ఉన్న 600 కేజీల గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి కేసులో ఇద్దరు...

తిరుత్తణి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట పరిసరాల్లో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో ఆ ప్రాంతంలో నిఘా ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గురువారం రాత్రి సమయంలో ఆర్కేపేట చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఆ ప్రాంతంలో బైక్‌పై సంచరిస్తున్న ఇద్దరి యువకులను ఆపి వారిబ్యాగులు తనిఖీ చేయగా, అందులో 100 గ్రాముల గంజాయి ప్యాకెట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు మారన్, గోవిందరాజన్‌లుగా పోలీసులు గుర్తించారు. కోర్టులో హాజరుపరిచిన అనంతరం వారిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

స్కూల్ వ్యానులో చెలరేగిన మంటలు

● 20 మంది విద్యార్థులకు తప్పిన ప్రమాదం

అడయార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుమంగళంలో శుక్రవారం ఉదయం విరుదునగర్ - మదురై రహదారిలో పాఠశాల వ్యానులో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్, స్థానికులతో కలిసి వ్యానులోని 20 మంది చిన్నారులను రక్షించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, అగ్నిమాపక సిబ్బంది సాయంతో మంటలను ఆర్పివేశారు.

● కోవై గ్యాంగ్ రేప్ కేసు వ్యవహారం..

నిందితులకు డీఎన్ఏ పరీక్ష

అడయార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 2న కోయంబత్తూరులో విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసులో అరెస్టయిన ముగ్గురు నిందితులకు డీఎన్ఏతో పాటు లైంగిక పటుత్వ పరీక్షలు నిర్వహించారు. కేసులో కరుప్పుస్వామి (30), కాళీశ్వరన్ (31) అనే ఇద్దరు అన్నదమ్ములతో పాటు వీరి బంధువు తవసి (20) కలిసి ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ కేసు విచారణ కోవై మహిళా కోర్టుకు మార్చారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు నిందితులకు కోర్టు ఆదేశం మేరకు గురువారం కోవై ప్రభుత్వ ఆస్పత్రిలో డీఎన్ఏ, లైంగిక సామర్థ్య పరీక్షలు చేసి, సేకరించిన శాంపిల్స్ చెన్నై లేబోరేటరీకి పంపించారు.

అడవి ఏనుగులకు పేర్లు పెట్టొద్దు

● అటవీశాఖ ఉత్తర్వులు

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అడవి ఏనుగులకు పేర్లు పెట్టకుండా వయసు బట్టి గుర్తించేలా అటవీశాఖ ప్రారంభించింది. రాష్ట్రంలో సుమారు 3,170కు పైగా ఏనుగులున్నట్లు అటవీశాఖ సర్వేలో తేలింది. ఇటీవల కాలంలో జనావాసాల్లోకి ఆహారం కోసం వస్తున్న అడవి ఏనుగులకు 'అరికొంబన్, పడయప్ప, బాహుబలి, రివోల్టా తదిదర సినిమా పేర్లతో అటవీ ప్రాంతప్రజలు పిలుస్తున్నారు. ఇలా పిలవడం వల్ల ఏనుగులకు భవిష్యత్తులో ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని గ్రహించిన అటవీశాఖ ఇకపై జనావాసాల్లోకి వచ్చే ఏనుగులను పేర్లతో పిలిచేందుకు నిషేధం విధించింది. జనావాసాల్లోకి పదేపదే వస్తున్న ఏనుగులను పేర్లతో పిలవకుండా సీ12, సీ14 అనే నెంబర్లను వినియోగించేకోవచ్చని, న్యాయస్థానం ఉత్తర్వులు, చట్టనిబంధనల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అటవీశాఖ స్పష్టం చేసింది.

ఊరికి ఉపకారి కాలువ కోసం రూ.10 కోట్ల స్థలం విరాళం



దాతలకు పూర్ణకుంభంతో స్వాగతిస్తున్న దృశ్యం

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి స్థలం విరాళంగా అందజేసిన దంపతులను అధికారులు ఘనంగా సత్కరించారు. తిరుప్పూర్ కార్పొరేషన్ 8వ వార్డు ప్రాంతంలో కాలువలు సక్రమంగా లేకపోవడంతో, వర్షాల సమయంలో నీరు వెళ్లే దారిలేక సమీపంలోని ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ ప్రాంతంలో వాననీటి కాలువ నిర్మించేందుకు తగిన స్థలం లేకపోవడంతో కార్పొరేషన్ అధికారులు ఏం చేయలేక ఉండిపోయారు. ఈ నేపథ్యంలో, అదే ప్రాంతానికి చెందిన మాజీ ఉపాధ్యాయుడు కృష్ణస్వామి-వల్లియమ్మాళ్ దంపతులు తమకు సొంతమైన రూ.10 కోట్ల విలువైన స్థలాన్ని వాననీటి కాలువ నిర్మాణం కోసం విరాళంగా అందించేందుకు అంగీకరించారు. శుక్రవారం ఆ దంపతులను స్థానికులు బాణాసంచా, మేళతాళాల నడుమ కార్పొరేషన్ కార్యాలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్పొరేషన్ అధికారులు దంపతులను పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం స్థలానికి సంబంధించిన పత్రాలను దంపతులు కార్పొరేషన్ అధికారులకు అందజేశారు.

మంత్రి పెరియస్వామి కుమార్తె ఇంట్లో 'డీజీజీఐ' తనిఖీలు

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఐ.పెరియస్వామి కుమార్తె ఇంద్రాణి ఇంట్లో జీఎస్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. కొద్ది నెలల కిత్రం మంత్రి పెరియస్వామి, ఆయన కుమారుడు, ఎమ్మెల్యే ఐపీ సెంథిల్‌కుమార్ ఇళ్లలో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. ఆ సమయంలో పెరియస్వామి కుమార్తె ఇంద్రాణికి సొంతమైన టెక్స్‌టైల్ మిల్లులో కూడా ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో, మంత్రి పెరియస్వామి కుమార్తె ఇంద్రాణి ఇంట్లో శుక్రవారం 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ)' విభాగానికి చెందిన నలుగురు అధికారులు తనిఖీలు చేశారు. ఇంద్రాణికి చెందిన టెక్స్‌టైల్ మిల్లులో పన్ను ఎగవేతను పాల్పడ్డారనే ఫిర్యాదు ఆధారంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.

భవన నిర్మాణ కార్మికులకు ప్రోత్సాహక వేతనంతో శిక్షణ

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు, రూ.45.21 కోట్ల ప్రోత్సాహకవేతనంతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తున్నట్లు కార్మిక సంక్షేమ శాఖ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో నమోదుచేసుకున్న కార్మికులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తున్నారు. నిర్మాణం, వైర్ బైండింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, వెల్డర్, పెయింటింగ్, ఏసీ మెకానిక్, గ్లాస్ ఇన్‌స్టాలేషన్, మార్బుల్ ఇన్‌స్టాలేషన్ తదితరాల్లో శిక్షణ అందిస్తున్నారు. ఇందుకోసం, రూ.45.21 కోట్లు కేటాయించగా, శిక్షణ కాలంలో తలా రోజుకు రూ.800 ప్రోత్సాహక వేతనం అందిస్తున్నారు. ఇప్పటి వరకు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 95 వృత్తి శిక్షణా కేంద్రాల్లో 11 వృత్తి విభాగాల్లో 21,344 మంది భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం, 5,465 మంది శిక్షణలో ఉన్నారని, శిక్షణ పొందగోరు కార్మికులు తమ జిల్లాల్లోని ఐటీఐ కేంద్రాలను సంప్రదించాలని కార్మిక సంక్షేమ శాఖ తెలియజేసింది.

తల్లి పాలు తాగుతూ పసికందు మృతి

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు తాగుతూ ఊపిరాడక పసికందు మృతిచెందింది. వలసరవాక్కం కృష్ణా వీధికి చెందిన ప్రదీప్‌కుమార్-రాజేశ్వరి దంపతులకు ముగ్గురు ఆడపిల్లలున్నారు. కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రిలో మూడు రోజుల క్రితం రాజేశ్వరి మరో ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తల్లి, బిడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఉదయం రాజేశ్వరి బిడ్డకు పాలు పడుతు సమయంలో, హఠాత్తుగా పసికందు ఊపిరాడక విలవిలలాడింది. రాజేశ్వరి కేకలకు వైద్యులు వెంటనే వెళ్లి బిడ్డను పరీక్షించి, అప్పటికే బిడ్డ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ వ్యవహారంపై వలసరవాక్కం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. తల్లి పాలిచ్చే సమయంలో ఊపిరాడక బిడ్డ మృతిచెందిందా? మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు.

తిరుప్పరంకుండ్రంపై డ్రోన్ కెమెరా

● యూట్యూబర్ అరెస్టు

టి.నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం క్షేత్రాన్ని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ న్యాయమూర్తి పరిశీలన జరుపుతున్న సమయంలో ఆ కొండపై డ్రోన్ కెమెరా ఎగురేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. కార్తీకదీపోత్సవం సందర్భంగా తిరుప్పరంకుండ్రంపై మహాదీపాన్ని వెలిగించే విషయమై హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరుపుతున్న న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ ఆ పర్వతశిఖరాగ్రంపై అధికారులు, ఆలయ నిర్వాహకులతో కలిసి పరిశీలించారు. ఆ సమయంలో ఓ డ్రోన్ ఎగురుతూ వెళ్ళింది. అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దానిని ఎగురవేసిన వ్యక్తి కోసం గాలించారు. చివరకు ఆ డ్రోన్ ఎగురవేసింది పళంగానత్తమ్ ప్రాంతానికి చెందిన యూట్యూబర్ మణి అని తెలియడంతో పోలీసులు అరెస్టు చేసి అతడి వద్దనున్న డ్రోన్ కెమెరా స్వాధీనం చేసుకున్నారు.

రైల్లో కరాటే పోటీ విజేతల పతకాలు, ప్రశంసాపత్రాల చోరీ

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో విజయం సాధించి రైలులో రాష్ట్రానికి తిరిగి వస్తున్న విజేతల పతకాలు, ప్రశంసాపత్రాలు చోరీకి గురయ్యాయి. మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో రాష్ట్రం తరఫున తిరుచ్చి జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొని, పలు విభాగాల్లో పతకాలు సాధించారు. పోటీల తరువాత వారంతా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. రాత్రి వేళ విద్యార్థులు నిద్రపోతున్న సమయంలో వారి పతకాలు, ప్రశంసాపత్రాలు, దుస్తులు ఉన్న బ్యాగులను గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు. ఈ విషయమై ఆన్‌లైన్‌లో రైల్వే శాఖకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు.

దివ్యాంగులను తీసుకొచ్చే వాహనాలకు పావుగంట ఉచితం

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయానికి దివ్యాంగులను తీసుకొచ్చే వాహనాలకు 15 నిమిషాలు ఉచిత సమయం కేటాయించారు. మీనంబాక్కం విమానాశ్రయంలోని అంతర్జాతీయ, దేశీయ టెర్మినల్స్ దగ్గరకు ప్రయాణికులను తీసుకొచ్చే వాహనాలకు పది నిమిషాల వరకు ఎలాంటి పార్కింగ్ రుసుము వసూలుచేయడం లేదు. అనంతరం 30 నిమిషాలకు పార్కింగ్ ఫీజుగా రూ.85 చెల్లించాల్సి ఉంటుంది. కానీ, దివ్యాంగులు, వృద్ధులు, రోగులు, గర్భిణులను వాహనాల నుంచి దించడం, ఎక్కించడంలో ఈ సమయం సరిపోవడం లేదు. ఈ విషయమై దృష్టి సారించిన విమానాశ్రయ అధికారులు, దివ్యాంగులు, వృద్ధులు, రోగులు, గర్భిణిలను తీసుకొచ్చే వాహనాలకు పావుగంట ఉచిత సమయం కేటాయించారు. అంతకు మించి వాహనం నిలిపితే పార్కింగ్ రుసుము చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.


కార్మికుడికి రూ.5 కోట్ల జీఎస్టీ నోటీసులు !

వేలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు జీఎస్టీ చెల్లించాలంటూ వస్తున్న నోటీసులు ఆగడం లేదు. ఇటీవల అంబూర్ ప్రాంతంలోని 70 ఏళ్ల వృద్ధుడు రూ.1.5 కోట్ల జీఎస్టీ బకాయి చెల్లించాలంటూ నోటీసు అందిన విషయం తెలిసిందే. అలాంటి ఘటన వాణియంబాడిలో చోటుచేసుకుంది. వాణియంబాడి సమీపం తిరుమంచోలై ప్రాంతానికి చెందిన రామమూర్తి షామియానాలు వేస్తుంటారు. ఆయనకు ఇటీవల ఆదాయపన్ను శాఖ నుంచి నోటీసు వచ్చింది. అందులో... రామమూర్తి చెన్నైలో రామ్ ట్రేడర్స్ పేరుతో కంపెనీ నడుపుతున్నట్లు, ఆ కంపెనీ రూ.5 కోట్ల జీఎస్టీ పన్ను బకాయి ఉందని ఉండడంతో రామమూర్తి దిగ్భ్రాంతి చెందాడు. ఈ విషయమై రామమూర్తి మాట్లాడుతూ... తనకు వాణియంబాడిలోని గ్రామీణ బ్యాంకులో మాత్రమే ఖాతా ఉందని, తాను ఇప్పటివరకు చెన్నై వెళ్లలేదని తెలిపారు. తన ఆధార్ కార్డ్, పాన్ కార్డు ఉపయోగించి గుర్తుతెలియని వ్యక్తులు మోసగించి ఉంటారని తెలిపారు. ఈ విషయమై రామమూర్తి శుక్రవారం వాణియంబాడి నగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

తిరుక్కోవిలూరు బీఎల్వో ఆత్మహత్య

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కళ్ళకురిచ్చి జిల్లా తిరుక్కోవిలూరుకు చెందిన బూత్ లెవల్ ఆఫీసర్ జకితా బేగం (37) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తనక్కందళ్ గ్రామ నిర్వహణాధికారిగా పనిచేస్తున్న ఆమెకు ఎన్నికల సంఘం అధికారులు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులు కేటాయిస్తూ బీఎల్వోగా నియమించారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఇంటికి చేరుకున్న జకితా బేగం ఊయల తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంకు తరలించారు. ఓ వైపు గ్రామ నిర్వహణాధికారిగా, మరో వైపు బీఎల్వోగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పనిభారం కారణంగా ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆర్కేపేటలో గుండెపోటుతో టీచర్ మృతి



నీలసాక్ష్య (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న నీలసాక్ష్య (50) గుండెపోటుతో కన్నుమూశారు. గురువారం మధ్యాహ్నం ఆమె పాఠశాల బయట హఠాత్తుగా స్పృహకోల్పోయారు. గమనించిన స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం సాయంత్రం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని దీనిపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

అభిమానులు లేకుంటే నటీనటులు లేరు

● కె.భాగ్యరాజ్


'నిర్వాగం పొరుప్పల్ల' ఆడియో రిలీజ్ దృశ్యం

అభిమానులు, ప్రేక్షక దేవుళ్ళు లేకపోతే నటీనటులు లేరని, అందువల్ల అన్ని ప్రశంసలు వారికే దక్కాలని సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ అన్నారు. ఆర్కే డ్రీమ్ ఫ్యాక్టరీ పతాకంపై టి.రాధాకృష్ణన్ నిర్మాణ సారథ్యంలో ఎస్.కీర్తీశ్వరన్ దర్శకత్వం వహించి నటించిన 'నిర్వాగం పొరుప్పల్ల' మూవీ ఆడియోను కె.భాగ్యరాజ్ ఆవిష్కరించారు. గురువారం నగరంలో జరిగిన ఈ వేడుకలో చిత్ర బృందంతో పాటు విరుగంబాక్కం ఎమ్మెల్యే రాజా, దర్శక నటుడు గౌరవ్ నారాయణన్ తదితరులు హాజరయ్యారు. కీర్తీశ్వరన్ రూపొందించిన ఈ చిత్రంలో లివింగ్‌స్టన్, ఇమాన్ అన్నాచ్చి, బ్లాక్ పాండి, రాణా, ఆధవన్, అహల్య వెంకటేశన్, శ్రీనిధి, అమ్మన్‌పురం శరవణన్, రాధాకృష్ణన్, ఎంఆర్ అర్జునన్, మృదులా సురేష్, జయశ్రీ శశిధరన్, మంజు తదితరులు నటించారు. ఈ సందర్భంగా కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ, 'గతంలో కోలీవుడ్‌లో ఆపద్బాంధవుడుగా శ్రీకాంత్ దేవా తండ్రి దేవా ఉండేవారు. ఇపుడు ఆ పేరును శ్రీకాంత్ దేవా కాపాడుతున్నారు. చిన్న నిర్మాతల పాలిట నిజమైన ఆపద్బాంధవుడుగా సంగీత దర్శకుడు శ్రీకాంత్ దేవా ఉన్నారు. ఆయనకు నా అభినందనలు. ఈ సినిమా స్టోరీ ఏంటి? అని దర్శకుడిని అడిగాను.. 'నేను మోసపోయాను.. అందువల్ల ఇతరులను కూడా నేను మోసం చేయాలని అనుకుంటున్నాను' అంటూ ఏకవాక్యంలో సమాధానం చెప్పారు. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. మరో అతిథి గౌరవ్ నారాయణన్ మాట్లాడుతూ, 'ప్రేక్షకులు ఆదరించిన సినిమా పెద్ద సినిమా.. లేకపోతే అది చిన్న సినిమా. ఇక్కడ హీరోతో పనిలేదు. కంటెంట్ ముఖ్యం. మంచి కథలను మీడియాతో పాటు ప్రేక్షకులు కూడా ఆదరిస్తున్నారు. దర్శక నిర్మాతలే మంచి కథలతో సినిమాలు తీయలేకపోతున్నాం' అని పేర్కొన్నారు.

ఇంటిపై రుణం తీసుకుని సినిమా నిర్మాణం


'మాస్క్'లో ఆండ్రియా, కవిన్

హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య పెద్ద సాహసం చేశారు. తన ఇంటిపై రుణం తీసుకుని సినిమా నిర్మించారు. 'మాస్క్' పేరుతో రూపొందించిన ఈ మూవీ శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ, 'ఇప్పటివరకు 35కుపైగా చిత్రాల్లో నటించాను. 'మాస్క్' కథ స్టోరీ నచ్చడంతో నేను, నిర్మాత చొక్కలింగం కలిసి నిర్మించాం. సినీ దర్శకుడు వెట్రిమారన్ ఈ సినిమా నిర్మాణంలో భాగస్వామి కాదు. కానీ, మా ప్రాజెక్టుకు ఆయన ఒక మెంటర్. క్రియేటివ్ ప్రొడ్యూసర్ మాత్రమే. ఎన్నో సంవత్సరాలు శ్రమించి సంపాదించి ఓ ఇల్లు నిర్మించుకున్నాను. ఇపుడు ఆ ఇంటిపై రుణం తీసుకుని ఈ సినిమా నిర్మించాను. ఈ విషయం తెలిసిన అనేక మంది నన్ను పిచ్చిదానిలా చూశారు. కానీ, సినిమాల్లో వచ్చిన సంపాదనలోనే ఇల్లు నిర్మించాను. ఇపుడు నాకు నచ్చిన కథతో సినిమా తీసేందుకు ఆ ఇంటిపై రుణం తీసుకోవడంలో తప్పులేదని భావించాను. అందుకే ఆ సాహసం చేశాను. నేను నటించిన 'మనుషి', 'పిశాచి-2' చిత్రాలు విడుదలకు నోచుకోకపోవడం చాలా బాధగా ఉంది. నేను హీరోయిన్‌గా నటించిన మరో సినిమా కూడా విడుదలకాలేదు. 'మాస్క్' సినిమా విజయం సాధించి లాభాలు వస్తే 'పిశాచి-2' చిత్రాన్ని నేనే రిలీజ్ చేస్తాను. 'మాస్క్' మూవీలో హీరో కవిన్ నటన చాలా బాగుంది' అని వివరించారు.

చిత్రజ్యోతి

'జైలర్-2'లో బాలీవుడ్ నటి?


అపేక్ష పార్వెల్

యువ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్-2' మూవీ కోసం బాలీవుడ్ నటి అపేక్ష పార్వెల్‌ను ఎంపిక చేశారు. బ్లాక్‌బస్టర్ మూవీ 'జైలర్'కు సీక్వెల్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఇప్పటికే రమ్యకృష్ణ, మిర్నా మేనన్, యోగిబాబు, అతిథి పాత్రల్లో మోహన్‌లాల్, శివరాజ్ కుమార్ నటిస్తున్న విషయం తెల్సిందే. రెండో భాగంలో కొత్తగా బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి, ఎస్‌జే సూర్య కలిశారు. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటి అపేక్ష పార్వెల్‌ను ఎంపిక చేశారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోంది. దీంతో యూనిట్ సభ్యులతో అపేక్ష కలిసి షూటింగ్‌లో పాల్గొంటున్నారు.

సన్మానం వద్దంటున్న నిర్మాత ఎస్.థాను



చిత్రపరిశ్రమలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతూ ఎంతో మంది నటీనటులకు భవిష్యత్ ఇచ్చిన ప్రముఖ నిర్మాతల్లో కలైపులి ఎస్.థాను ఒకరు. భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మించడంలో ఆయనకు ఆయనేసాటి. అయితే, ఆయన చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి 40 యేళ్ళుపూర్తయిన తరుణంలో భారీ సన్మానం చేయాలని పలువురు నిర్మాతలు, నటీనటులు భావిస్తున్నారు. దీనిపై నగరంలో జరిగిన ఓ ఆడియో రిలీజ్ వేడుకలో థాను మాట్లాడుతూ, 'నేటి సమాజంలో ఎంతో ముఖ్యమైనది నియంత్రణ. ప్రతి విషయంలో ఆచితూచి అడుగులు వేస్తూ ముందుకుసాగాలి. నాకు సన్మాన సభలు ఏమాత్రం నచ్చవు. సూపర్‌స్టార్ రజనీకాంత్ నటనలో 50 యేళ్ళు పూర్తి చేసుకున్నారు. ఆయన ఎన్నో రికార్డులు నెలకొల్పారు. అలాంటి వ్యక్తే సన్మానం వద్దని సున్నితంగా తిరస్కరించారు. ఇపుడు నాకు సన్మానమా? నాకెలాంటి సన్మానాలు వద్దు. ప్రజల కోసం, సమాజం కోసం ఏదైనా మంచి పని చేద్దాం' అని నిర్మాత ఎస్.థాను అన్నారు.


పునరుద్ధరించిన స్విమ్మింగ్ పూల్ ప్రారంభిస్తున్న ఎంపీ కనిమొళి

'సర్'తో భవిష్యత్తులో ప్రమాదం

● డీఎంకే ఎంపీ కనిమొళి

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'సర్' అమలుతో భవిష్యత్తులో పౌరసత్వాన్ని ప్రశ్నించే ప్రమాదముందని డీఎంకే ఎంపీ కనిమొళి ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో తూత్తుకుడి జిల్లా క్రీడా మైదానంలో తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ ట్రస్ట్ అందించిన రూ.1.45 కోట్ల సాయంతో పునరుద్ధరించిన స్విమ్మింగ్ పూల్‌ను డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కనిమొళి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కనిమొళి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర హక్కులు కాపాడేలా అన్నా, కరుణానిధి నుంచి నేడు ముఖ్యమంత్రి స్టాలిన్ వరకు పోరాటాలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ అధికారం చేపట్టిన అనంతరం, ఒక్కో బిల్లు ద్వారా, ఏ విధంగానైనా రాష్ట్రాల హక్కులు లాక్కోవడంపై దృష్టి సారించిందన్నారు. రాష్ట్రాలకు అందించాల్సిన నిధుల్లో సమన్యాయం పాటించడం లేదని విమర్శించారు. ఇలా పలు విషయాల్లో రాష్ట్రంపై కేంద్రం చిన్నచూపు చూస్తుందన్నారు. అయినా, రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతూనే ఉంటామని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో బీజేపీ అధికారంలోని లేని రాష్ట్రాల్లో, ఆ రాష్ట్ర ప్రజల ఓటు హక్కును హరిస్తున్న ఘటనలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర హక్కుల కాలరాయడం, భవిష్యత్తులో పౌరసత్వంపై కూడా ప్రశ్నించే పరిస్థితులు నెలకొంటాయని, ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని ఎంపీ కనిమొళి విజ్ఞప్తి చేశారు.

తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవానికి 4500 కిలోల ఆవిన్ నెయ్యి


తిరువణ్ణామలై ఆలయంలో భద్రపరుస్తున్న నేతి డబ్బాలు

టి.నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో కార్తీక మహాదీపోత్సవానికిగాను 4500 కేజీల నెయ్యి కొనుగోలు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అరుణాచలేశ్వరాలయంలో కార్తీక మహాదీపోత్సవాలు ఈ నెల 24న ధ్వజారోహణంతో ప్రారంభమై, పది రోజులపాటు జరుగనున్నాయి. ఈ ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన భరణిదీపోత్సవం డిసెంబర్ 3న వెలిగించనున్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయానికి వెనుక వైపున్న 2668 అడుగుల ఎత్తు పర్వత శిఖరాగ్రంపై మహాదీపం వెలిగిస్తారు. ఆ మహాదీపం వెలిగించడానికి 1500 మీటర్ల గాడా వస్త్రం, 4500 కేజీల నెయ్యి ఉపయోగిస్తారు. ఈ మహాదీపం 11 రోజులపాటు భక్తులకు దర్శనమిస్తుంది. ఈ నేపథ్యంలో మహాదీపం వెలిగించేందుకుగాను ఆలయ నిర్వాహకులు ఆవిన్ సంస్థ నుండి 4500 కేజీల నెయ్యి కొనుగోలు చేశారు. ఆ మేరకు ఆవిన్ సంస్థ సరఫరా చేసిన నేతి డబ్బాలను ఆలయంలో భద్రపరిచారు. ఇక కార్తీక దీపోత్సవం ప్రారంభసూచనగా శుక్రవారం రాత్రి ఊరి కావలి దైవం దుర్గాదేవి ఉత్సవం, పిడారీ అమ్మన్ ఉత్సవం, వినాయక ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

అరుణాచలం హుండీ ఆదాయం రూ.3.47 కోట్లు



వేలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.3.47 కోట్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఐప్పసి పౌర్ణమి వరకు ఆలయంలో ఏర్పాటుచేసిన హుండీల్లో భక్తులు వేసిన కానుకల లెక్కింపు ఆలయ ప్రాంగణంలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు కొనసాగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.3,47,56,689 నగదు, 104 గ్రాముల బంగారం, 2690 కి.గ్రా వెండి కానుకగా సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆరోగ్యంలో అత్యున్నతంగా ఏసీజీ ప్రోగ్రాం


హాజరైన స్వదేశీ, విదేశీ ప్రతినిధులు

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైద్యశాస్త్రం, పరిశోధన, శిక్షణ, నైపుణ్యం, ఆరోగ్య సంరక్షణలో ఉన్నత ప్రమాణాలే లక్ష్యంగా అడ్వాన్స్ సర్టిఫికేషన్ ఇన్ జనోమిక్స్ (ఏసీజీ) కార్యక్రమాన్ని నగరంలోని శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్, అపోలో నాలెడ్జ్ సంస్థలు సంయుక్తంగా గురువారం నిర్వహించాయి. ఇంగ్లాండ్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డేమ్‌సుహిల్, నేషనల్ హెల్త్ సర్వీస్ ప్రొఫెసర్ గీతా మేనన్ తదితర స్వదేశీ, విదేశీ నిపుణులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమాశేఖర్, ప్రొ-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మహేష్, రిజిస్ట్రార్ ఎస్.సెంథిల్‌కుమార్, ప్రొఫెసర్ సాల్మాన్, ప్రొఫెసర్ వెంకటాచలం, అపోలో నాలెడ్జ్ సీఈవో శివరామకృష్ణన్, వెంకటేశ్వరన్, అన్సుమ్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.



తరుణి

మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగినవారికి జీవితంలో ఏదైనా సాధించాలనే తపన ఎక్కువ ఉంటుంది. అలాంటి వారిలో సంధ్యా మణికంఠన్ ఒకరు. ఎన్నో డిగ్రీలు సాధించి విద్యావేత్తగా ఎదిగినా, విద్యతోపాటు లలిత కళలను కూడా నేర్చుకుంది. వేళచ్చేరిలో నివశిస్తున్న సంధ్య ఉపాధ్యాయురాలిగా, నర్తకిగా, సంగీత కళాకారిణిగా,, కాలిగ్రఫీ, పెయింటింగ్ కోచ్‌గా, వివిధ భాషల నిపుణురాలిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఖ్యాతి చెందింది. 'చంద్రా అకాడమీ' పేరుతో శిక్షణా సంస్థ స్థాపించి చిన్నారులకు అన్ని కళలపై శిక్షణ ఇస్తోంది. ఆన్‌లైన్‌లోనూ పాఠాలు బోధిస్తోంది. వివిధ రంగాల్లో రాణిస్తున్నప్పటికీ కళలను ఇతరులకు నేర్పుతున్నప్పుడు పొందే సంతృప్తి మాటల్లో వర్ణింపలేనని చెబుతున్న సంధ్య జీవన ప్రస్థానం నేటి 'తరుణి'లో.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి


స్ఫూర్తిదాయకమైన మహిళా అవార్డును స్వీకరిస్తున్న సంధ్యా

భావితరాలకు భారతీయ కళలపై శిక్షణ

● బహుముఖ ప్రజ్ఞాశాలి సంధ్యా మణికంఠన్

స్వీయ సంపాదనతోనే ఎదిగా...


నృత్యశిక్షణ పొందుతున్న చిన్నారులతో

నేను చాలా సాధారణ కుటుంబం నుండి వచ్చాను. నా తల్లి ఎస్ఐ. నా చదువులకు, నా విజయాలకు ఆమే ప్రేరణ. నేను పాఠశాలలో చదువుతున్నప్పుడు తమిళం, ఇంగ్లీష్, హిందీ సహా అనేక భాషలు మాట్లాడటం, రాయటం నేర్చుకున్నాను. ఫ్రెంచ్, సంస్కృత భాషలను కూడా ప్రైవేట్‌గా చదివాను. ఉన్నత విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత, ఇంటిలో ట్యూషన్ తరగతులు ప్రారంభించి, దాని ద్వారా వచ్చిన ఆదాయంతోనే ఉన్నత విద్యనభ్యసించాను. బీఎస్సీ, బీఈడీ, ఎంబీఏ చదివాను. పీహెచ్‌డీ చేశాను. హిందీలో డిప్లొమా, ఎంఏ పూర్తి చేశాను. ఇప్పటి వరకు ఐదు డిప్లొమాలు పూర్తి చేశాను. ప్రస్తుతం వేళచ్చేరిలో విద్య, అబాకస్, భాషా తరగతుల వంటి తరగతులకు ట్యూషన్ తీసుకుంటున్నాను. నాకు విద్యపైనే కాకుండా, కళలపై కూడా ఆసక్తి పెరిగింది. చిన్నప్పటి నుండి భరతనాట్యం, గాత్ర, సంగీత వాద్య సంగీతంపై సునిశిత శిక్షణ పొందాను. వేలాదిమంది విద్యార్థులు హిందీ భాషా శిక్షణ పొందుతున్నారు. అదే విధంగా కాలిగ్రఫీ, పెయింటింగ్, ఫోనిక్స్ పదాల ఉచ్చరణపై శిక్షణ కూడా అందిస్తున్నాను.

శిక్షణ తరగతులు..

వేళచ్చేరిలో 'చంద్రా అకాడమీ' ద్వారా బాలబాలికలకు నాట్యంపై, అబాకస్, వివిధ భాషలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాను. ఆన్‌లైన్ శిక్షణ కూడా ఇస్తున్నాను. అమెరికా, ఖతార్, అబుదాబీ, దుబాయ్, జపాన్, శ్రీలంక, రష్యా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, సింగపూర్, మలేసియా సహా పలు దేశాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో భరతనాట్యం నేర్చుకుంటున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల విద్యార్థులు చాలామంది నా వద్దే భరతనాట్యం నేర్చుకుంటున్నారు.

కళల పట్ల మక్కువ...

ఐదేళ్ల ప్రాయంలోనే భరతనాట్యం నేర్చుకుని, ఎనిమిదేళ్ళ వయస్సులో అరంగేట్రం చేశాను. గురువు మలర్కొడి విజయరాఘవన్ దగ్గర భరతనాట్యం నేర్చుకుని, ప్రస్తుతం ఇతరులకు నాట్యం నేర్పించే స్థాయికి చేరుకున్నాను. 200 మందికి పైగా నాదగ్గర శిక్షణ పొందారు. భరతనాట్య ప్రదర్శన ద్వారా పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు అవార్డు అందుకోవడం మరుపురాని అనుభూతి. ఆ నృత్య ప్రదర్శనకు అవార్డుతో పాటు బంగారు పతకం కూడా అందుకున్నాను. అదే విధంగా చెన్నైలో ప్రధాని నరేంద్రమోదీ హాజరైన కార్యక్రమంలో స్వాగత నృత్యం చేయడం ఒక అపూర్వమైన సంఘటన.

తల్లి ప్రోత్సాహం...

నాలో విద్య, కళల పట్ల ఆసక్తి పెరగడానికి కావడానికి కారణం నా తల్లి. మంచి విద్యావంతురాలిగా పేరు తెచ్చుకోవాలని, వివిధ కళలను నేర్చుకోవాలని ఆమె నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తూవచ్చింది. నన్ను ఇంతటి ఉన్నత స్థితికి తీసుకురావడంలో ఆమె పాత్ర ఎనలేనిది. నా భర్త సాఫ్ట్‌వేర్‌లో పనిచేస్తున్నప్పటికీ, నా తల్లితోపాటు ఆయన కూడా నాకు ఎంతో సపోర్ట్‌గా నిలుస్తున్నారు. నేనింతవరకూ వందకు పైగా అవార్డులు అందుకున్నాను.

వివిధ కళలు నేర్చుకున్నప్పటికీ, ఆ కళలను ఇతరులకు నేర్పుతున్నప్పుడు పొందే ఆత్మసంతృప్తి మాటల్లో వర్ణింపలేనిది. ఫీజులు భరించలేని, కళలను నేర్చుకోవాలనే తపన కలిగిన నిరుపేద విద్యార్థులకు ఉచితంగానే నేర్పుతున్నాను' అని సంధ్యా మణికంఠన్ తెలిపారు.


'నాట్యమామణి' అవార్డు అందుకుంటూ..

హిందూస్థాన్ ఇంటర్నేషనల్ స్కూలులో...

అట్టహాసంగా కేక్ మిక్సింగ్ వేడుక


కేక్ మిక్సింగ్ వేడుకల్లో పాల్గొన్న హిందూస్థాన్ గ్రూపు విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పదూరులోని హిందూస్థాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో క్రిస్మస్ కేక్ మిక్సింగ్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు శాంతా క్లాజ్ టోపీలు ధరించి కేక్ మిక్సింగ్ చేశారు. ఈ వేడుకల్లో హిందూస్థాన్ గ్రూపు విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్, హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ప్రొ - ఛాన్సలర్ డాక్టర్ అశోక్ జార్జ్ వర్గీస్, కేఎస్‌జీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ అన్నే జేకబ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంపూర్ణ సహాయ సహకారాలు

● కెన్సెస్ గ్రూపు చైర్మన్ నరసారెడ్డి


విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న నరసారెడ్డి

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తామని కెన్సెస్ గ్రూపు సంస్థల అధినేత నరసారెడ్డి తెలిపారు. స్థానిక టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో గత 12 సంవత్సరాలుగా విద్యార్థులకు నరసారెడ్డి సాయంత్రం అల్పాహారం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరానికి గాను శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఉపాధ్యాయ బృందం సమష్టిగా కృషి చేస్తూ పాఠశాల అభివృద్ధికి దోహదపడుతున్నారని ప్రశంసించారు. ఈ సారి పాఠశాలలో పది, ప్లస్‌టూ తరగతుల్లో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.50 వేలు బహుమతిగా అందజేస్తామని ప్రకటించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య నరసారెడ్డిని ఈ సందర్భంగా సత్కరించారు.

రేపు పళ్లిపట్టుకు ఉడిపీ పీఠాధిపతి


ఉడిపీ పీఠాధిపతి ఈషాప్రియ తీర్థస్వామి

తిరుత్తణి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉడిపీ పీఠాధిపతి ఈషాప్రియ తీర్థస్వామి శనివారం ఉదయం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టుకు రానున్నారు. ధర్మపరిరక్షణలో భాగంగా గోసంరక్షణ, రైతుల సంక్షేమం, జానపద కళల అభివృద్ధి తదితరాలను కాంక్షిస్తూ పళ్లిపట్టు బజారువీధిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించనున్న పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

షోళింగర్ నరసింహునికి టీటీడీ పట్టువస్త్రాలు


పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న టీటీడీ అధికారులు

తిరుత్తణి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా షోళింగర్‌లో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీ నరసింహస్వామివారికి ప్రతి ఏటా కార్తిక మాసంలో టీటీడీ నుండి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం టీటీడీ నుండి వచ్చిన పట్టువస్త్రాలను నరసింహస్వామి ఆలయ నిర్వాహకులు ఊరేగింపుగా కొండపైకి తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పట్టువస్త్రాలను అర్చకులు అలంకరింపజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రవి, కమిటీ సభ్యులు హరీష్, రాజ్‌కుమార్, వేలూరు ఆలయ సంయుక్త కమిషనర్ విజయ, షోళింగర్ ఆలయ కమిషనర్ రాజా, నరసింహరాజు, రవిచంద్రరాజు, పూర్ణచంద్రన్, భట్టాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కనువిందుగా వసంతోత్సవం



అమ్మవారు ఊరేగుతుంటే.. అర్చకులు, అధికారులు వసంతాన్ని చల్లుతుంటే.. భక్తుల గోవింద నామస్మరణలతో తిరుచానూరు ఆలయ తిరుమాడవీధులు ప్రతిధ్వనించాయి. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారిని స్వర్ణకమల తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు, టీటీడీ అధికారులు చందనం కలిపిన నీటిని భక్తులపై చల్లుతూ వసంతోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. జోరు వర్షంలోను అమ్మవారి వాహన సేవ జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సహస్ర లక్ష్మీకాసులహారం శోభాయాత్ర

పున్నమి గరుడసేవలో శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీకాసులహారం శుక్రవారం పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరింది. గజవాహన సేవలో ఈ హారాన్ని అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుంచి అదనపు ఈవో వెంకయ్య చౌదరి లక్ష్మీకాసుల హారాన్ని అలిపిరికి తీసుకొచ్చారు. అక్కడ్నుంచి శోభాయాత్రగా జేఈవో వీరబ్రహ్మం, ఇతర అధికారులతో కలిసి మండపానికి తీసుకొచ్చారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆ కాసుల హారాన్ని అర్చకులకు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ అమ్మవారి ఆలాయానికి హారాన్ని తీసుకొచ్చి మూలవర్లకు అలంకరించారు. రాత్రి గజ వాహనసేవలో ఉత్సవమూర్తికి ఈ సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని ధరింపచేశారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



లక్ష్మీకాసుల హారం: శోభాయాత్రలో పాల్గొన్న టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు



అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పల్లకీ సేవ, రాత్రి గజవాహన సేవ ముందు కళాకారుల నృత్య సంబరం అమోఘంగా సాగింది. వివిధ రాష్ట్రాల కళాకారులు మాడవీధుల్లో ప్రదర్శించిన నృత్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. తీన్‌మార్ డ్రమ్స్, రింగ్ ఫిజన్, ట్రైబల్ డ్యాన్స్, కోలాటాల ప్రదర్శనలు భక్తులు ఆకర్షించాయి.ఉదయం నూజివీడుకు చెందిన అమరావతి డ్రమ్స్ రాంబాబు బృందం తీన్‌మార్ డ్రమ్స్.. తణుకుకు చెందిన అంబిక డ్యాన్స్ అకాడమీకి చెందిన 20మంది కళాకారుల రింగ్ ఫ్యూజన్ నృత్యం, నూజివీడు లాలేశ్వరరావు బృందం చెక్క భజనలు, కొవ్వూరుకు చెందిన శివరామకృష్ణ బృందం ట్రైబల్ డ్యాన్స్ భక్తులను కనువిందు చేశాయి. తిరుపతికి చెందిన హరిత బృందం పలు దేవతా మూర్తులు, డాక్టర్ మురళీకృష్ణ బృందం నవదుర్గలు, అష్టలక్ష్మి వేషధారణ భక్తులను మైమరిపించాయి. చిత్తూరుకు చెందిన వాణిశ్రీ బృందం, పొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి బృందం, రైల్వే కోడూరుకు చెందిన నసుజన కోలాటాలు అలరించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



నృత్య సంబరం.. అమోఘం











రూ.400 కోట్లతో వాణిజ్య సముదాయాలతో

భారీ మెట్రో స్టేషన్

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు మెట్రో మార్గాలతో అనుసంధానం అవుతున్న షోలింగనల్లూర్‌లో, రూ.400 కోట్లతో వాణిజ్య సముదాయాలతో మెట్రో రైల్వేస్టేషన్ ఏర్పాటుకానుంది. నగరంలో మెట్రో రెండో విడత ప్రాజెక్ట్‌లో మూడు మార్గల్లో 116 కి.మీ మేర మెట్రో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మాధవరం-షోలింగనల్లూర్ మార్గం రెట్టేరి జంక్షన్, విల్లివాక్కం, వలసరవాక్కం, పోరూర్, ఆలందూర్, ఆదంబాక్కం, మడిపాక్కం, కీలకట్టలై, మేడవాక్కం జంక్షన్, పెరుంబాక్కం మార్గంగా ఏర్పాటవుతోంది. మరో మార్గం మాధవరం నుంచి పెరంబూర్, నుంగంబాక్కం, థౌజండ్ లైట్స్, మైలాపూర్, అడయార్, షోలింగనల్లూర్ మీదుగా సిరుచ్చేరి వరకు వెళుతోంది. ఈ రెండు మార్గాలు కలిసే ప్రాంతం షోలింగనల్లూర్ మెట్రో రైల్వేస్టేషన్ ఏర్పాటుకానుంది. ఈ విషయమై చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారులు మాట్లాడుతూ... రెండో మెట్రో ప్రాజెక్ట్‌లో షోలింగనల్లూర్ ప్రధాన రైల్వేస్టేషన్‌గా ఉంటుందన్నారు. ఓఎంఆర్, ఈసీఆర్ ప్రాంతాల్లో ఐటీ సహా పలు సంస్థలుండడంతో, ప్రయాణికులకు అవసరమైన వాణిజ్య సముదాయాలు, వినోదభరిత అంశాలతో కూడిన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఈ స్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద 8 అంతస్తులతో భవనం నిర్మించనున్నామని, ఈ భవనం-మెట్రో రైల్వేస్టేషన్‌ను అనుసంధానం చేసేలా ఒక వంతెన నిర్మించనున్నామని తెలిపారు.



షోలింగనల్లూర్‌లో నిర్మిస్తున్న మెట్రో రైల్వేస్టేషన్

అళగర్‌కోవిల్ కోటలోకి

వాహనాల రాకపోకలపై హైకోర్టు 'స్టే'

టి.నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదురై అళగర్ కోవిల్ సమీపంలోని హిరణ్యుడి కోట ప్రాంతంలో వాహనాల సంచారం, పార్కింగ్‌పై హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ 'స్టే' విధించింది. హిరణ్యుడి కోట ప్రాంతంలో దేవాదాయ శాఖ వాణిజ్యపరమైన భవనాలు నిర్మించేందుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరుతూ కొంతమంది హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై జరిగిన విచారణ సందర్భంగా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు హాజరై ప్రధాన ఆలయమైన అళగర్ కోవిల్‌కు 85 మీటర్ల దూరంలో ఉన్న 13.43 ఎకరాల హిరణ్యుడి కోట ప్రాంతం వద్ద ఆలయానికి వచ్చే భక్తులకు సదుపాయాలు, ఆలయానికి ఆదాయం వచ్చేలా భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అక్కడ భవనాలు నిర్మించడం వల్ల అళగర్ కోవిల్‌కు ఎలాంటి నష్టం కలుగదని స్పష్టం చేశారు. ఆ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తులు జస్టిస్ అనితా సుమంత్, జస్టిస్ కుమరప్పన్‌తో కూడిన ధర్మాసనం హిరణ్యుడి కోట ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితులే కొనసాగాలని ఉత్తర్వులిచ్చారు. ఈ కేసు విచారణలో భాగంగా తాము హిరణ్యుడి కోట లోపలి ప్రాంతాన్ని సందర్శించామని, అక్కడ వేల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు, వ్యాన్‌లు, బస్సులు పార్కింగ్ చేస్తున్నారని, దీంతో అళగర్ ఆలయ అందాలకు హాని కలిగే అవకాశం ఉందని, కనుక ఆ ప్రాంతంలోకి వాహనాల రాకపోకలపై స్టే విధిస్తున్నామని, అదే సమయంలో వృద్ధులు, దివ్యాంగులు, అంధులు, రోగులు ఆలయాన్ని సందర్శించేందుకు ఆలయనిర్వాహకులు తగిన వాహన సదుపాయం కల్పించాలని ఆదేశించిన న్యాయమూర్తులు, ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 25న జరుపుతామని పేర్కొన్నారు.



అళగర్ కోవిల్ సమీపంలోని హిరణ్యుడి కోట

పంచమి తీర్థానికి పటిష్ఠ బందోబస్తు

తిరుచానూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన 25వ తేదీ జరిగే పంచమి తీర్థానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అడిషనల్ డీజీపీ మధుసూదన్‌రెడ్డి, అనంతపురం రేంజీ డీఐజీ షిముషీ, ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పంచమి తీర్థం ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయం, పుష్కరిణి పరిసరాలు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు. స్నానాలు చేసే భక్తుల భద్రత దృష్ట్యా పుష్కరిణిలో లైఫ్‌గార్డులు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, పోలీసు డైవర్స్, విజిలెన్సు బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు వెంకట నారాయణ, ప్రసాద్, గిరిధర్, టీటీడీ విజిలెన్సు అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ డీజీపీ మధుసూదన్‌రెడ్డి, అనంతపురం రేంజీ డీఐజీ షిముషి, ఎస్పీ తదితరులు

పోటెత్తిన భక్తులు

- సాయంత్రానికే నిండిన గ్యాలరీలు

తిరుచానూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో శుక్రవారం రాత్రి జరిగిన పద్మావతి అమ్మవారి గజ వాహన సేవకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం 6.45 గంటలకే భక్తులతో గ్యాలరీలు నిండిపోయాయి. మాడవీధుల్లో భక్తులు కిక్కిరిసి ఉన్నారు వెలుపల ప్రధాన మార్గం వరకు భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. ఇక, గేట్ నెంబర్ 2ను సాయంత్రం 6.30గంటలకు మూసేయడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎమ్మెల్యే నాని హారతి పాయింట్ ఉన్న ప్రతిగేట్ వద్ద విజిలెన్సు సిబ్బందికి తొక్కిసలాటలు లేకుండా సూచనలు సలహాలు ఇచ్చారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో స్థానికులు రావడంతో కాస్త తోపులాట జరిగింది. రాత్రి 10.20 గంటలకు అమ్మవారి గజ వాహనం.. గంగుండ్ర మండపం వద్దకు చేరింది. చిన్న చిన్న ఘటనలు మినహా వాహన సేవ ప్రశాంతంగా ముగిసింది.

టీవీకే ఆధ్వర్యంలో 'పీపుల్స్ ప్రొటెక్షన్ ఫోర్స్'



శిక్షణలో పీపుల్స్ ప్రొటెక్షన్ ఫోర్స్

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటన అనంతరం తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షులు విజయ్ మళ్లీ ప్రజలను కలుసుకునేందుకు సిద్ధమవుతున్నారు. భవిష్యత్తులో చేపట్టనున్న ప్రచార సమయంలో కరూర్ దుర్ఘటన పునరావృతం కాకుండా విజయ్ చర్యలు చేపట్టారు. ఆ ప్రకారం, ప్రచారంలో ప్రజలకు రక్షణ కల్పించడం సహా పలు అంశాలు పర్యవేక్షించేందుకు 'పీపుల్స్ ప్రొటెక్షన్ ఫోర్స్' ఏర్పాటుచేయనున్నట్లు సమాచారం. ఈ విభాగంలోని సిబ్బంది, పార్టీ కార్యకర్తలతో కలసి పనిచేస్తారని పార్టీ ఇదివరకే ప్రకటించింది. ప్రస్తుతం ఈ విభాగానికి ఎంపిక చేసిన సిబ్బందికి ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ పోలీసు అధికారి రవికుమార్ నేతృత్వంలో శిక్షణ ఇస్తున్నారు. రోజుకు వంద మందికి శిక్షణ ఇస్తున్నారు.శిక్షణ పూర్తిచేసిన వారు విజయ్ ప్రచార సభలో పాల్గొని, రద్దీ నియంత్రించే పనులు చేపడతారని టీవీకే వర్గాలు తెలిపాయి.

ఆఫ్రికన్ చిలుక కనిపించడం లేదంటూ పోస్టర్లు



చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికన్ చిలుక కనిపించడం లేదని, ఆ చిలుకను పట్టించిన వారికి రూ.5 వేలు బహుమతి అందజేస్తామని నామక్కల్ జిల్లాలో పోస్టర్లు వెలిశాయి. నామక్కల్‌కు చెంది మాజీ వైమానికదళ ఉద్యోగి, అరుదైన ఆఫ్రికన్ చిలుకను పెంచుతున్నాడు. ఈ చిలుక కొద్దిరోజుల క్రితం కనిపించకుండా పోయింది. పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ వ్యక్తి కనిపించకుడా పోయిన ఆఫ్రికన్ చిలుకను పట్టించిన వారికి రూ.5,000 బహుమతి ఇస్తాననే పోస్టర్లు నగర వ్యాప్తంగా అంటించాడు.

పెంపుడు జంతువులతో ఆస్పత్రులకు

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శునకాల కు.ని కేంద్రాలు, వెటర్నరీ ఆస్పత్రులకు పెంపుడు జంతువుల యజమానులు పరుగులు తీస్తున్నారు. జీసీసీ పరిధిలోని పెంపుడు జంతువుల యజమానులు, వాటికి లైసెన్స్‌తో పాటు టీకా వేయించి, మైక్రో చిప్ అమర్చుకోవాలని జీసీసీ ప్రకటన విడుదల చేసింది. కానీ దానిని పెంపుడు జంతువుల యజమానులు పట్టించుకోలేదు. దీనిపై దృష్టి సారించిన జీసీసీ, ఈ నెల 23వ తేదిలోగా పెంపుడు జంతువులకు లైసెన్స్, టీకా వేయించుకోవాలని, ఆపై లైసెన్స్ లేని పెంపుడు జంతువుల యజమానులకు రూ.5,000 జరిమానా విధిస్తామని హెచ్చరించింది. అలాగే, పెంపుడు జంతువుల యజమానుల సౌకర్యార్థం గత రెండు ఆదివారాల్లో ఏడు ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించగా, ఈ నెల 23వ తేది కూడా ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో, పెంపుడు జంతువులకు టీకాలు వేయించేందుకు శుక్రవారం శునకాల కు.ని కేంద్రాలు, వెటర్నరీ ఆస్పత్రుల వద్ద పెంపుడు జంతువుల యజమానులు బారులుదీరుతున్నారు.



వెటర్నరీ ఆస్పత్రి వద్ద పెంపుడు జంతువుల యజమానులు